# అత్తరు సాహెబ్

గ్రామాలలో పండుగలపుడు అత్తరుసాహెబ్ అత్తర్లు తీసికొనివచ్చి ప్రతి సంవత్సరం వతనుగా కొందరు రైతులకు గ్రామపెద్దలకు అత్తర్, అగరబత్తీలు, సుర్మాయివ్వటం వారికి రకరకాల మాటలుచెప్పి వారితో ఎక్కువగా అత్తరును కొనిపించడం జరుగుతు ఉంటుంది. ఇప్పటికి ముఖ్యంగా సంక్రాంతి పండుగకు పంటలు పండి రైతులకు ఇంటికి ధాన్యం వచ్చుట, వారు కొంత ధాన్యం అమ్మి నగదును ఇంటి ఖర్చుకు పండగ ఖర్చుకు ఉంచుకొను విషయం తెలిసినదే. ఆ సంక్రాంతి పండుగ ముందు అత్తరు సాహెబ్ వచ్చి వతనుగా కొందరు గ్రామస్థులకు సంవత్సరానికిగాని ఆరు మాసములకుగాని సరిపడా అత్తరు, సాంబ్రాణి, అగర్‌బత్తీ వగైరా ఇచ్చి వారివద్దనుండి వాటి ఖరీదు తీసికొనుట ఇప్పటికీ కూడా చాలా గ్రామాలలో జరుగుతుంది. రైతుల తాత, తండ్రి తరములవారిగా అత్తరు సాహెబ్‌లు కూడా తాత, తండ్రి తరములవారు వచ్చి వతనుగా అత్తరు ఇచ్చివెళతారు. వారి సరుకు యెక్కువగా అమ్ముడుపోవుటకు రైతునకు ఉల్లాసమయిన మాటలు అనగా ఆ రైతు తండ్రి ఎంతో రసికుడని తనదగ్గర ఎక్కువ మొత్తములో అత్తరు తీసికొనేవాడని తీయనిమాటలతో రైతుతో ఎక్కువ సరుకు కొనిపిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే హిందువుల పండుగలపుడు ముస్లిములు (సాహెబ్‌లు) వచ్చి అత్తరు అమ్ముకొనటం, ఒకరిమతం పై ఒకరికున్న అభిమానము, సహజీవనం తెలియచేస్తుంది. ఇప్పటికీ పాతతరం అత్తరుసాహెబ్‌లు గ్రామాలకు పండుగల కొచ్చి అత్తరులు అమ్ముచున్నారు.

ఈ కళారూపానికి వచ్చే ప్రేక్షకులను ఆకొట్టుకొనుటను హాస్యన్ని ఎక్కువ జోడించటం జరుగుతుంది. చిన్న గడ్డాలు, సన్న మీసాలు, తలకుపాగాలు, గళ్లలుంగీలు, పొడవాటి చొక్కా వేసుకొని ఏర్రగుడ్డలో పెట్టెలో అత్తరు సీసాలు వేసుకొని వాటిని భుజాన వేసుకొని అత్తరు సెంట్లు అంటూ కేకలేస్తారు. కళాకారులు ఇద్దరు చాలు. వారు ఈ విధముగా చెబుతారు : ఇది హేరాయిల్, తలకి రాసుకునే ఆమ్లా ఉందిసార్. గంజాం ఆమ్లా దీనికింద బలాదూర్ ఒక్కసారి ఈ ఆమ్ల తలకి రాస్తే మీ తల ఇంకదువ్వేపనిలేదు సర్కార్, అంతా గుండుహైపొతాది హేడి తగ్గుతాది, హీట్ పెర్గుతాది. ఈ విధంగా వారి సంభాషణ హాస్యంతో సాగుతుంది.